క్లుప్తంగా

పీహెచ్‌సీల్లో వైద్యసేవల పరిశీలన



తోణాం ఆరోగ్య కేంద్రం వద్ద ప్రత్యేక వైద్యాధికారి, సిబ్బంది

సాలూరు రూరల్: మండలంలోని తోణాం, మామిడిపల్లి ఆరోగ్య కేంద్రాలను సోమవారం ప్రభుత్వ ప్రత్యేక వైద్యాధికారి రమేష్ సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తోణాం, మామిడిపల్లి పీహెచ్‌సీల్లో ఆరోగ్య సేవలు సక్రమంగా అందుతున్నాయన్నారు. పీహెచ్‌సీలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. తోణాం పీహెచ్‌సీ భవనం శిథిలావస్థలో ఉందని గుర్తించి కొత్త భవనంలోకి మార్చే విధంగా కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. ఆయన వెంట డాక్టర్ శివకుమార్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

బలిజిపేట: త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచార కార్యక్రమాన్ని ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ సభ్యులు నిర్వహించారు. మండలంలో గలావల్లి, గంగాడ, నారన్నాయుడువలస గ్రామాల్లో సోమవారం ఇంటింటా తిరిగి భగవద్గీత బోధనలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కార్తీక దీపం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్తీక పౌర్ణమి రోజున దేవాలయాల్లో ధ్వజస్తంభం పైన దీపం వెలిగిస్తారు. ఇలా వెలిగించడం వలన దేవాలయంలో ధ్వజస్తంభం నుంచి దేవుని రాజ్యం ప్రారంభమై గర్భగుడిలోని భగవంతుని వరకు దైవరాజ్యమే ఉంటుందన్న విషయాన్ని తెలియచేస్తుందన్నారు. కార్తీక మాసంలో అందరూ దీపారాధన చేయాలని, యోగా సాధన చేయడానికి గుర్తుగా దీపం వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో బొద్దాం కమిటీ అధ్యక్షుడు ఎం.రామినాయుడు, పారారావు, మద్దిరాజు, ఈశ్వరమ్మ, లక్ష్మి, రమణమ్మ, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 3, 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పలువురు వ్యవసాయ కార్మికులతో కలిసి పలు డిమాండ్‌లతో కూడిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇళ్లస్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అయితే ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే ప్రకటించడంతో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేసుకోలేకపోయారన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అంతేకాకుండా అధికారం చేపట్టాక ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు చొప్పున అందిస్తామన్నారన్నారు. ఆయా హామీల సాధనే లక్ష్యంగా ఈ నెల 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాల వద్ద వినతిపత్రాలు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

15న బిర్సాముండా జయంత్యుత్సవాలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న తొలి ఆదివాసీ ఉద్యమకారుడు బిర్సాముండా జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణలు కోరారు. ఇదే విషయమై వారు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు డి.సురేష్, సహాయ కార్యదర్శి తిరుపతిలతో కలిసి విలేకరులతో సోమవారం మాట్లాడారు. బ్రిటిష్ వారిపై బిర్సాముండా అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అలాగే ఆదివాసీల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రముఖులతో ప్రసంగాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. వీటితో పాటు ప్రస్తుత రోజుల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించి, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

పవర్ ఇక ప్రీపెయిడ్

- విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు వడివడిగా అడుగులు
- మొదటగా ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ సర్వీసు మీటర్ల మార్పు
- ముందుగా రీచార్జ్ చేస్తేనే విద్యుత్ సరఫరా
- మొండి బకాయిలకు చెక్ పెట్టేందుకు విద్యుత్‌శాఖ నిర్ణయం

ఉపయోగాలు..

- నూతన ప్రీపెయిడ్ మీటర్లతో అనవసరపు విద్యుత్ వినియోగం తగ్గుతుంది.
- వినియోగదారుల్లో బాధ్యత పెరుగుతుంది.
- మొండి బకాయిల బెడద తప్పుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై అధిక బకాయిలు పెండింగ్‌లో ఉంచే అవకాశం ఉండదు.
- సెల్ ఫోన్లో బ్యాలెన్స్ ఏ విధంగా చెక్ చేసుకుంటామో.. ఇక్కడ అదేవిధంగా యాప్‌లో బ్యాలెన్స్‌ను చెక్ చేసుకోవచ్చు.

నష్టాలు..

- విద్యుత్ సంస్థను నమ్ముకని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న మీటర్ రీడర్లు జీవనోపాధి కోల్పోయే అవకాశాలున్నాయి.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏమాత్రం అలసత్వం వహించినా సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంది.

బలిజిపేట:

రానున్న రోజుల్లో విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్ విధానంలోకి మారనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు రానున్నాయి. మొదట మ్యాన్యువల్ మీటర్ల నుంచి ప్రారంభమైన విద్యుత్ మీటర్లు ఆధునిక పరిజ్ఞానానికి అనుగుణంగా మారుతూ వచ్చాయి. ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల వంతు వచ్చింది. ప్రీపెయిడ్ ఆప్షన్‌తో ఈ మీటర్లు రూపొందించారు. సాధారణంగా ఒక నెలలో వినియోగించిన విద్యుత్ బిల్లును వినియోగదారులు మరుసటి నెల చెల్లిస్తున్నారు. బిల్లు ఇచ్చిన 15 రోజుల వరకు ఎటువంటి అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లింపునకు దాదాపు నెల వరకు సమయం ఉంటుంది. ఇప్పటి వరకు అనుసరిస్తున్న పద్ధతి ఇదే. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మీటర్లలో ప్రీపెయిడ్ ఆప్షన్ జత చేశారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా కోసం ముందుగానే రీచార్జీ చేయాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్లను ఏ విధంగా అయితే ముందుగా రీచార్జ్ చేసుకుని వాడుతున్నామో అలా అన్నమాట. మన గృహ అవసరాలకు అనుగుణంగా ముందుగా చెల్లించిన మొత్తం మేరకు విద్యుత్ సరాఫరా చేస్తారు. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే సరఫరా ఆటోమేటిక్‌గా నిలిచిపోతుంది. సరఫరా పునరుద్ధరణ కోసం మళ్లీ రీచార్జ్ చేయించుకోవాలి. లేదంటే చీకట్లో మగ్గాల్సి వస్తుంది. ప్రస్తుతం ఈ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం అన్ని రకాల విద్యుత్ సర్వీసులను స్మార్ట్ మీటర్లుగా మార్పు చేయనున్నారు.

బలిజిపేట మండలంలో..

మండలంలో మొత్తం 18,299 సర్వీసులు ఉన్నాయి. వాటిలో గృహ వినియోగానికి 15,385 సర్వీసులు, కమర్షియల్ 1,073, రైస్ మిల్లులు, పిండి మిల్లులు(కేటగిరి–3) 62, వీధి దీపాల సర్వీసులు 333, వ్యవసాయ పంపుసెట్లు 1,446 సర్వీసులు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతానికి 266 మీటర్లను స్మార్ట్ మీటర్లుగా మార్పుచేశారు.



బలిజిపేటలోని ఓ షాపులో ఏర్పాటుచేసిన ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్

గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు

స్మార్ట్ మీటర్ల అమరిక వలన గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. అత్యవసర సమయాల్లో రీచార్జ్ అయిపోతే అప్పుడు ఏవిధంగా గడపగలం. పరిస్థితి దృష్ట్యా ఎన్నో సమస్యలు తలెత్తుతాయి. విద్యుత్‌శాఖ అధికారులు దీనిని గమనించాలి.

– వెంకటినాయుడు, వినియోగదారు, బలిజిపేట

ఇప్పటికి ఇవి స్మార్ట్ మీటర్లే..

ప్రస్తుతం స్మార్ట్ మీటర్లగానే మార్పులు చేస్తున్నాం. ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ కేటగిరీకి చెందినవాటిని మార్పుచేస్తున్నాం. ఆ తరువాత పూర్తిస్థాయిలో అన్నింటినీ మార్పు చేయడం జరుగుతుంది. ప్రస్తుతం అమర్చిన వాటికి రీడర్ లేకుండా వినియోగదారుకే బిల్లింగ్ వస్తుంది. ఆ మేరకు వారు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.

– రమణారావు, ఏడీఏ, విద్యుత్‌శాఖ, పార్వతీపురం

ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలందించాలి

- ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పీఓ నరేష్

బలిజిపేట: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించాలని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పీఓ నరేష్ సూచించారు. మండలంలో బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీలను, చిలకలపల్లి, వంతరాం హెల్త్ క్లినిక్‌లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఆరోగ్య కేంద్రాల్లో ఉండే వైద్యసదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది, వారి పనితీరును పరిశీలించారు. ప్రజలకు ఆరోగ్య సేవలను నిరంతరం అందించాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సేవలందించే క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటికి తగిన వైద్యసేవలు అందించడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ డాక్టర్ కోటిరెడ్డి, పార్వతీపురం పీపీ యూనిట్ వైద్యాధికారి విజయ్‌మోహన్, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి, మాధురి, తదితరులు పాల్గొన్నారు.



చిలకలపల్లి హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న పీఓ నరేష్

పోడుపట్టాలు మంజూరు చేయాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న రైతులు

పార్వతీపురంటౌన్: పోడు వ్యవసాయం చేస్తున్న తమ భూములకు పట్టాలివ్వాలని రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు పి.శ్రీనునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మక్కువ మండలం డి.శిర్లాం పంచాయతీ మెట్టలోవరఖండి గ్రామ రైతులతో కలిసి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కువ మండలం డి.శిర్లాం పంచాయతీ మెట్టలోవరఖండి గ్రామంలో గత 25 ఏళ్లుగా సుమారు 80 ఎకరాల పోడు భూమిని తామంతా సాగు చేసుకుంటున్నామన్నారు. ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఇదివరకే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రీసర్వే సమయంలో సర్వే కూడా చేశారని, అయినా తమకు ఇప్పటి వరకు పట్టాలు మంజూరు చేయలేదని వాపోయారు. తాము సాగుచేసుకుంటున్న 80 ఎకరాల పోడుభూమికి గాను పట్టాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.అసిరి, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డీఆర్‌ఓ విధుల్లో చేరేనా..?

పార్వతీపురం: జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్నవారే గాని, ఆ స్థానాల్లో వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా రెవెన్యూ అధికారిగా జె.వెంకటరావు ఉండేవారు. ఎన్నికల సమయంలో ఆయన బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కీలకమైన డీఆర్‌ఓ పోస్టు ఇన్‌చార్జ్‌లతోనే నడుస్తోంది. పలుమార్లు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు జరిగి జిల్లాకు డీఆర్‌ఓలను నియమించినా ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ మొగ్గు చూపడం లేదు. గత నెల 24న జరిగిన బదిలీల్లో మన్యం జిల్లా రెవెన్యూ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ ఎ.రవీంద్రరావును నియమించారు. రెండువారాలు గడచినా ఆయన విధుల్లో చేరలేదు. మొన్నటి వరకు ఇన్‌చార్జ్ డీఆర్‌ఓగా ఉన్న కేశవనాయుడు సైతం బదిలీపై రిలీవ్ అయ్యి వెళ్లిపోయారు. ఇప్పుడు కొత్తగా నియామకం అయిన రవీంద్రరావు విధుల్లో చేరుతారన్న నమ్మకం లేదు. పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు డీఆర్‌ఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆయన పార్వతీపురం ఐటీడీఏ పీఓగాను వ్యవహరిస్తున్నారు. ఇవేకాక కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్, ఎల్‌టీఆర్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలు కూడా ఆయన వద్దే ఉన్నాయి. దీనికి తోడు కొద్దిరోజుల పాటు సెలవుపై వెళ్లిన సంయుక్త కలెక్టర్ శోభిక బాధ్యతలను ఆయనే చూస్తున్నారు. ఇలా కీలకమైన శాఖలన్నీ ఆయనపైనే ఉండడంతో మరింత పని భారం పెరగనుంది. జిల్లా రెవెన్యూ శాఖకే కాక కలెక్టరేట్‌కు డీఆర్‌ఓ పెద్ద దిక్కుగా వ్యవహరించాల్సి ఉంటుంది. జిల్లా పరిపాలనలో డీఆర్‌ఓ పాత్ర కీలకం. ఇటువంటి కీలమైన విభాగానికి దాదాపు ఆరేడు నెలలుగా రెగ్యులర్ అధికారి లేకపోవడం గమనార్హం.

సారా, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



ఎక్సైజ్ సీఐ జి.దాసు

సాలూరు: మద్యం బెల్ట్‌షాప్‌ల నిర్వహణ, సారా తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జి.దాసు తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. శాఖాపరంగా ఈ నెలలో 13 కేసులు నమోదుచేసి 10 మంది ముద్దాయిలను అరెస్ట్ చేశామన్నారు. 1600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశామని, 800 సారా ప్యాకెట్లు, 199 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు ముద్దాయిలను పాచిపెంట తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో తనిఖీలు, దాడులు మరింత ముమ్మరం చేస్తామన్నారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం: ఏఎస్పీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత సురాన

సీతానగరం: పోక్సో చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు పోలీస్ శాఖ చేస్తున్న కృషికి తోడుగా సచివాలయాల రక్షణ కార్యదర్శులు సమగ్రమైన సమాచారం సేకరించి సహకరించాలని ఏఎస్పీ అంకిత సురాన అన్నారు. సీతానగరం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ముందుగా సచివాయ రక్షణ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వారు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా నేరస్తులను గుర్తించి సమగ్రమైన సమాచరాం పోలీసులకు అందించాలని సూచించారు. మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడేవారు ఎంతటివారైనా పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ రక్షణ కార్యదర్శుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్ భవనానికి చేస్తున్న మరమ్మతులను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, ఎస్‌ఐ ఎం.రాజేష్, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా గ్రామానికి రోడ్డు నిర్మించాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: తమ గ్రామానికి రోడ్డు వేయాలని సాలూరు మండలం కొడమ పంచాయతీ సిరివర గ్రామ గిరిజనులు కోరారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్‌తో కలిసి సోమవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణనలో నిరసన తెలియజేశారు. అనంతరం పీఓ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు లేకపోవడం వల్ల మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారాయని వాపోయారు. దీనిపై పీఓ సానుకూలంగా స్పందించారు. గ్రామానికి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ రానో, గ్రామస్తులు కృష్ణ, సోన్న, బత్రే, డుంబ్రి, సీతయ్య, కళ్యాణ్, రాము, బిందో, లోబో తదితరు పాల్గొన్నారు.

రైతుల్లో అల్పపీడనం గుబులు



చినభోగిలిలో వరిచేను కుప్పలను పరిశీలిస్తున్న డీఏఓ రాబర్ట్‌పాల్

సీతానగరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు వేయడంతో రైతులు అప్రమత్తమయ్యారు. చేతికందిన వరిపంట వర్షానికి తడిచిపోకుండా కాపాడుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కోతలు పూర్తిచేసిన రైతులు పొలాల్లోనే పంటను కుప్పలుగా పెడుతున్నారు. పంటకోతకు సిద్ధమైన వారంతా కోతను వాయిదావేసుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ మండలంలోని చినభోగిలి, కాశీపేట, పణుకుపేట, తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటకోతలు, నూర్పులు వాయిదావేసుకోవాలని సూచించారు. జిల్లాలో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఏఓ ఎస్.అవినాష్, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఓం నమః శివాయ, హరహర మహాదేవ, శంభోశంకర అంటూ దిక్కులు పిక్కటిల్లేలా శరణుఘోష చేశారు. భక్తుల శరణుఘోషతో ఆలయాలు మార్మోగాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురంటౌన్: పసుపతినాథ్ బ్రహ్మ సూత్ర శివాలయంలో బారులుతీరిన భక్తులు



పార్వతీపురంటౌన్: అడ్డాపుశీల ఆలయంలో శివలింగానికి పుష్పాభిషేకం



బలిజిపేట: నారాయణపురం శివాలంయలో పూజలు చేస్తున్న అర్చకులు



పార్వతీపురం: సంగంవలసలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు



పార్వతీపురంటౌన్: వైకేఎం కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు



బలిజిపేట: గలావల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తరలిపోతున్న ధాన్యం



బస్తాలకు లోడ్ చేస్తున్న ధాన్యం



ధాన్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

సీతానగరం: మండలంలో వరికోతలు, నూర్పులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇతర జిల్లాల నుంచి ధాన్యం నూర్పిడి యంత్రాలు రావడంతో రైతులు త్వరగా పంటకోతలు పూర్తిచేసి, నూర్పిడి చేస్తున్నారు. పండిన ధాన్యాన్ని బస్తాల్లో పోసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతులను దోచుకుంటున్నారు. ఇప్పటికే పెదంకలాం, సుమిత్రాపురం, కృష్ణరాయపురం గ్రామాల నుంచి ప్రతిరోజు ధాన్యం బస్తాల లోడుతో వాహనాలు మండపేట, కత్తిపూడి తదితర ప్రాంతాలకు తరలిపోతున్నాయి.